సాక్షి
గుంటూరు
మంగళవారం : 6 : మే : 2025



విష్ణుమూర్తిగా స్వామి దర్శనం

పొన్నూరు : శ్రీ సుందరవల్లీ సమేత సాక్షి భావన్నారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. విష్ణుమూర్తి అలంకరణలో స్వామి దర్శనమిచ్చారు.



పుస్తక పఠనం అలవరుచుకోవాలి

ప్రత్తిపాడు: పుస్తక పఠనాన్ని అలవరుచుకోవాలని గ్రంథాలయ అధికారి బి.అరుణ అన్నారు. ప్రత్తిపాడు లైబ్రరీలో సోమవారం విద్యార్థుల తో పుస్తక పఠనం చేయించారు.

మద్దిరాలమ్మ గ్రామోత్సవం



నగరం: ఏలేటిపాలెం గ్రామదేవత మద్దిరాలమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా సోమవారం గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఘటాలను ఏలేటిపాలెం నుంచి భట్టువారిపాలెం గ్రామానికి తరలించారు.

న్యూస్‌రీల్

ఘనంగా బగళాముఖి జయంతి పూజలు



చందోలు(కర్లపాలెం): చందోలు గ్రామంలో వేంచేసియున్న బగళాముఖి అమ్మవారి జయంతి పూజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయంలోని 108 కళాశాలలో మహిళలు సుగంధ ద్రవ్యాలు తీసుకువచ్చి సామూహిక అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి నిజరూప బగళాముఖి అలంకారం చేసి, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు సమర్పించిన స్వర్ణవర్ణపు సింహం విగ్రహాలను అమ్మవారి విగ్రహం ముందు ఇరువైపులా ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

సూర్యప్రభ వాహనంపై ఊరేగిన శ్రీక్షీరభావన్నారాయణస్వామి



బాపట్ల: శ్రీక్షీరభావన్నారాయణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సూర్యప్రభ వాహనంపై స్వామి ఊరేగింపు జరిగింది. నవాహ్నిక దీక్ష పూర్వక బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఊరేగింపు చేపట్టారు. భక్తులు టెంకాయలు కొట్టి పూజలు చేశారు.

జీజీహెచ్ సిబ్బందికి మెమోలు

అడిషనల్ డీఎంఈ ఆకస్మిక తనిఖీలు

గుంటూరు జీజీహెచ్: గుంటూరు జీజీహెచ్‌లో సోమవారం అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ఆకస్మిక తనిఖీలు చేశారు. తొలుత గతంలో నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఆషా సజనీపై వచ్చిన ఆరోపణలపై విచారణ నిర్వహించారు. అనంతరం ఆర్థోపెడిక్ ఆపరేషన్ థియేటర్‌లో తనిఖీలు చేశారు. ఆపరేషన్ థియేటర్‌లో సక్రమంగా ఓటీ డ్రస్సులు ధరించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత వైద్య సిబ్బంది, వైద్యులకు మెమోలు జారీ చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణను ఆదేశించారు. మార్చురీ విభాగంలో తనిఖీలు చేశారు. లిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న మనోజ్ మార్చురీ విభాగంలో విధులు నిర్వహిస్తుండటంతో అతనిని అక్కడి నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. వైద్య విద్యార్థులకు మార్చురీ విభాగంలో క్లినికల్ తరగతులు నిర్వహించేందుకు వసతులు పరిశీలించారు. నాట్కో క్యాన్సర్ సెంటర్ విభాగంలో వైద్యులు, వైద్య అధికారులతో సమావేశం నిర్వహించి ఆసుపత్రి అభివృద్ధిపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంఈ వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, నర్సింగ్ రిజిస్ట్రారు సుశీల తదితరులు ఉన్నారు.

చైల్డ్ హోమ్‌కు పసికందు



పొన్నూరు: మండలంలోని పచ్చల తాడిపర్రు గ్రామంలోని పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు వదిలి వెళ్లిన పసికందుకు నిడుబ్రోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించారు. ఆరోగ్యం కుదుటపడిన నేపథ్యంలో సోమవారం మగ శిశువును వైద్యశాల డాక్టర్ ఫిరోజ్ ఖాన్ గుంటూరు చైల్డ్ హోమ్ నిర్వాహకులకు సీడీపీఓ వెంకట రమణ ఆధ్వర్యంలో అందజేశారు.

తిరుపతమ్మ ఆలయానికి ట్రాక్టర్ ట్రక్కు బహూకరణ

పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి సోమవారం గ్రామానికే చెందిన కర్ల భాస్కరరావు, పద్మావతి దంపతుల కుమారులు కర్ల రామకృష్ణారావు, వసుంధర దంపతులు, కర్ల శ్రీనివాసరావు, పద్మావతి దంపతులు రూ.2.50లక్షల విలువైన ట్రాక్టర్ ట్రక్కును బహూకరించారు. గతంలో వీరు ఆలయానికి రూ.10 లక్షల విలువైన ట్రాక్టర్‌ను కూడా అందించారని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదాలతో సత్కరించారు.

బియ్యం బొక్కుతున్న పచ్చకొక్కులు

- తెలుగు తమ్ముళ్ల కనుసన్నల్లో రేషన్ బియ్యం అక్రమ రవాణా
- వారికే అమ్మాలంటూ డెప్యూటీ తహసీల్దార్ బెదిరింపులు
- ఇచ్చిన ధరకే కట్టుబడాలంటూ ఒత్తిళ్లు
- ఒప్పుకోని వారి షాపులపై దాడులు, బియ్యం పట్టివేత
- ఆఖరికి హత్య కేసుల్లో కూడా రేషన్ మాఫియా
- వీరయ్య చౌదరి కేసులో పొన్నూరు మాఫియా హస్తం



రేషన్ మాఫియా గోడౌన్‌లో బియ్యం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: జిల్లాలో రేషన్ మాఫియా రెచ్చిపోతోంది. తెలుగు తమ్ముళ్ల కనుసన్నల్లోనే దందా నిరాటంకంగా కొనసాగుతోంది. తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు చెప్పిన వారికే బియ్యం అమ్మాలంటూ దుకాణదారులపై సివిల్ సప్లైస్ డెప్యూటీ తహసీల్దార్ ఒత్తిళ్లు తేవడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఒప్పుకోని షాపులపై దాడులు చేస్తూ, కేసులు నమోదు చేస్తున్నారు. ఈ దందాపై ఓ డీలర్ జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించారు. విజిలెన్స్ అధికారులు కూడా మామూళ్ల మత్తులో కూరుకుపోవడంతో రేషన్ మాఫియా చెలరేగిపోతోంది.

సగానికి పైగానే అక్రమార్కుల చేతుల్లోకి...

జిల్లాలోని మొత్తం ఏడు నియోజకవర్గాల పరిధిలో 5,99,511 రేషన్ కార్డులున్నాయి. 972 రేషన్ దుకాణాల నుంచి 353 ఎండీయూ వాహనాల ద్వారా నెలకు సుమారు 9 వేల మెట్రిక్ టన్నులు బియ్యాన్ని ప్రజలకు అధికారులు అందించాల్సి ఉంది. అయితే, ఈ మొత్తం బియ్యంలో దాదాపు సగానికి పైగానే అక్రమార్కుల చేతిలోకి వెళ్లిపోతోంది. కేంద్ర ప్రభుత్వం కిలో బియ్యానికి రూ.43 వెచ్చిస్తోంది. కొందరు ఎండీయూ వాహనదారులు మాఫియాతో చేతులు కలిపారు. పేదల నుంచి కేజీ రూ.15 చొప్పున కొనుగోలు చేస్తూ అధిక మొత్తానికి విదేశాలకు సైతం ఎగుమతి చేస్తున్నట్లు సమాచారం.

అధికారులకు సైతం బెదిరింపులు

గుంటూరు పట్టణ పరిధిలో కొందరు దళారులు కూటమి నేతల పేర్లు చెప్పి అధికారులను బెదిరిస్తున్నారు. వారి సాయంతోనే ఎండీయూ వాహనదారుల నుంచి అక్రమంగా బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. దీనిపై గతంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు చేసినా స్పందన లేదు. మూడు రోజుల ముందు నెహ్రూనగర్‌లోని ఒక ఎండీయూ వాహనాన్ని తనిఖీ చేసిన అధికారులు కేసులు నమోదు చేయకుండా వదిలేశారు. గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల్లో ఇద్దరు వ్యక్తులు రేషన్ మాఫియాను నడిపిస్తున్నట్లు అధికారులే చెబుతున్నారు. వారికి కూటమి నేతల అండదండలు పుష్కలంగా ఉన్నట్లు సమాచారం.

చుండూరులో నిల్వ

పొన్నూరు నియోజకవర్గంలో రేషన్ అక్రమ రవాణా గుర్తు చప్పుడు కాకుండా కొనసాగుతోంది. కార్డుదారుల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని నియోజకవర్గంలో నిల్వ చేయడం లేదు. ద్విచక్ర వాహనాల ద్వారా ఒకటి, రెండు క్వింటాలు చుండూరుకు తరలిస్తున్నారు. ఇటీవల పొన్నూరు పట్టణం కేంద్రంగా రేషన్ అక్రమ రవాణా చేసేందుకు రేషన్ మాఫియా మిల్లును ఏర్పాటు చేసినట్టు సమాచారం. అయితే, రాజకీయ కారణాలతో అక్రమ రవాణా కార్యకలాపాలు కొనసాగలేదు. దీంతో చుండూరులోని మిల్లును కొన్ని మండలాలకు చెందిన రేషన్ బియ్యం అక్రమ రవాణాకు కేంద్రంగా ఏర్పాటు చేసుకున్నారు. పొన్నూరు, చేబ్రోలు మండలాల పరిధిలో పట్టుబడుతున్న బియ్యం ఎక్కువ సంఖ్యలో ఇతర మండలాలకు చెందినవిగా పోలీసులు గుర్తిస్తున్నారు. అవి చుండూరుకే వెళుతున్నట్లు సమాచారం. రేషన్ మాఫియాలో గుంటూరుకు చెందిన సుబ్బారావు కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. ఇటీవల ప్రకాశం జిల్లాలో జరిగిన తెలుగుదేశం నేత హత్యలో కూడా పొన్నూరుకు చెందిన రేషన్ మాఫియాను విచారించిన సంగతి తెలిసిందే.

తెనాలిలోనూ మాఫియా తిష్ట

తెనాలిలో రేషన్ అక్రమాలు సుధీర్, అశోక్ చౌదరి ఆధ్వర్యంలో సాగుతున్నాయి. సుధీర్ ఇక్కడి ఇండస్ట్రియల్ ఎస్టేట్ కేంద్రంగా బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్నాడు. ఇటీవల మండలంలోని పెదరావూరు గ్రామానికి మకాం మార్చాడు. ఇక్కడ బియ్యం సేకరించి బాపట్ల జిల్లా చుండూరుకు పంపుతున్నాడు. ప్రస్తుతం తెలుగు తమ్ముళ్లు రంగంలోకి దిగి రేషన్ అక్రమార్కులతో చర్యలు జరుపుతున్నారు. నెల నెలా ఎంత ఇస్తారు? పోలీసులకు ఎంత? రెవెన్యూ అధికారులకు ఎంత ఇస్తారు ? అని సుమారు నెల రోజులుగా మంతనాలు జరుపుతున్నట్టు తెలిసింది. పొన్నూరులో సుమారు ఏడేళ్లుగా ఒకే స్టేషనులో పని చేస్తున్న కానిస్టేబుల్.. డీఎస్పీ స్థాయి వ్యక్తి తనకు బాగా పరిచయం అని చెప్పి రేషన్ అక్రమార్కులకు అండగా నిలుస్తున్నాడని పక్కా సమాచారం. ఏడేళ్లలో నల్లపాడు స్టేషన్‌లో మూడు నెలలు, తెనాలి టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల మూడు నెలలు మాత్రమే పని చేశాడు. ఉన్నతాధికారులకు రేషన్ అక్రమార్కుల నుంచి డబ్బులు వసూలు చేసి ఇస్తుంటాడు.

మంగళగిరిలో ఏకంగా మిల్లులకు అమ్మకం

మంగళగిరిలో రేషన్ బియ్యం మాఫియా చెలరేగిపోతోంది. దళారులు కిలో రూ.12కి కొనుగోలుచేసి, మిల్లర్లకు రూ.25కి విక్రయిస్తున్నారు. మంగళగిరిలో గతంలో ఇంటింటికీ తిరిగి బియ్యం కొనుగోలు చేసి మధ్యలో ఉన్న దళారులకు అమ్మేవాళ్లు. ఇపుడు నేరుగా రేషన్ డీలర్లు రైస్ మిల్లులకు అమ్మేస్తున్నారు. ఇంత జరుగుతున్నా జిల్లాకే చెందిన పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్ మాత్రం మొదట్లో ఒకటి రెండు మిల్లుల్లో హడావుడి చేసి తర్వాత మిన్నకున్నారు.

కలెక్టర్‌కు డీలర్ మొర



పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన చౌటుపల్లి సునీల్ కుమార్

చౌటుపల్లి సునీల్ కుమార్ అనే ఎండీయూ వాహనదారుడు రేషన్ మాఫియాపై సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశాడు. బేగ్ అనే డెప్యూటీ తహసీల్దార్ తనను తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నాడని, అక్రమ కేసులు బనాయించి బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. నిజాయతీగా సేవలందిస్తున్నప్పటికీ కొందరి మెప్పుకోసం డీటీ తనను టార్గెట్ చేశాడని కలెక్టర్‌కు మొరపెట్టుకున్నాడు. ఈ సంఘటనను బట్టి రేషన్ మాఫియాకు అధికారులు ఎంతగా సపోర్ట్ చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

ఎమ్మెల్యే పీఏ దందా

గుంటూరు తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అనుచరుడు, పీఏగా ఉన్న వ్యక్తి ద్వారా ఈ దందా నడుస్తోంది. రేషన్ మాఫియాలో గతంలో ఉన్న వ్యక్తులు మేకల అనిల్, నాగేశ్వరరావు, సుబ్బారావు, శివ అనే వ్యక్తుల ద్వారా రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేయిస్తున్నాడు. వీరిలో అనిల్ కీలకంగా చెబుతున్నారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో కొద్దికాలం కిందట నెహ్రూనగర్‌కు చెందిన సుబ్బారావుపై కేసు నమోదైంది. ఈ నాలుగు నెలల్లో పాత గుంటూరు, లాలాపేట స్టేషన్ల పరిధిలో కేసులే నమోదు కాలేదు. పూర్తిస్థాయిలో పోలీసులతో కూడా సత్సంబంధాలు ఉండటం కూడా ఒక కారణంగా చెబుతున్నారు. ఎమ్మెల్యే అనుచరుడు సూచించిన వారికే బియ్యం, కందిపప్పు నెలవారీ అందజేస్తున్నట్లు సమాచారం. కార్డుదారులకు కిలోకు ఎనిమిది రూపాయల చొప్పున చెల్లించి బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. రేషన్ మాఫియా నెలకు మూడు లక్షల నుంచి ఐదు లక్షల వరకూ ఎమ్మెల్యేకు ముట్టచెబుతున్నట్లు తెలిసింది.



ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం (ఫైల్)

ఉత్తమ ప్రదర్శనగా '27వ మైలురాయి'



ఉత్తమ ప్రదర్శన బహుమతిని అందుకుంటున్న '27వ మైలురాయి' నాటిక బృందం

- ఉత్తమ నటుడు గోవాడ వెంకట్
- ఉత్తమ నటి సురభి ప్రభావతి



ఉత్తమ నటి బహుమతిని అందుకుంటున్న సురభి ప్రభావతి

తెనాలి: రూరల్ మండలం కొలకలూరులో కొలంకపురి నాటక కళాపరిషత్, శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి 11వ ఆహ్వాన నాటికల పోటీల్లో యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్, విజయవాడ వారి '27వ మైలురాయి' నాటిక ఉత్తమ ప్రదర్శన బహుమతిని అందుకుంది. ఇదే నాటికలో వైదేహి పాత్రలో నటించిన ప్రముఖ రంగస్థల, టీవీ, సినీ నటి సురభి ప్రభావతి ఉత్తమ నటిగా, రాజన్న పాత్రధారి పవన్ కుమార్ ఉత్తమ క్యారెక్టర్ నటుడుగా, నాటిక రచయిత పీటీ మాధవ్ ఉత్తమ రచయిత బహుమతులను అందుకున్నారు. మూడురోజులపాటు జరిగిన నాటికల పోటీల్లో విజేతలకు చివరి రోజైన ఆదివారం రాత్రి బహుమతులను అందజేశారు. ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా చైతన్య కళాస్రవంతి, విశాఖపట్నం వారు ప్రదర్శించి 'అ సత్యం' నాటిక ఎంపికైంది. ఇదే నాటికకు మరో నాలుగు బహుమతులు దక్కటం విశేషం. రఘుపతి పాత్రధారి వై.అనిల్‌కుమార్ ఉత్తమ ప్రతినాయకుడు, నాటిక దర్శకుడు పి.బాలాజీనాయక్‌కు, సంగీతాన్ని అందించిన పి.లీలామోహన్‌కు ఉత్తమ సంగీతం, ఉత్తమ లైటింగ్‌కు థామస్ బహుమతులను అందుకున్నారు. తృతీయ ఉత్తమ ప్రదర్శనగా విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్, హైదరాబాద్ వారి 'స్వేచ్ఛ' నాటిక ఎంపికైంది. ఇదే నాటికలో నటించిన గోవాడ వెంకట్ ఉత్తమ నటుడు అవార్డును గెలుచుకున్నారు. 'మతమా మానవత్వమా'నాటికలో నటించిన కె.రాజేశ్వరికి ఉత్తమ క్యారెక్టర్ నటి బహుమతిరాగా, 'మహాప్రస్థానం'లో సింహాద్రి పాత్రధారి బొర్రా నరేస్‌కు ఉత్తమ సహాయనటుడు బహుమతి లభించింది. 'రుతువు లేని కాలం'లో నటించిన జి.సురేంద్రబాబుకు ఉత్తమ హాస్యనటుడు, 'బ్రహ్మస్వరూపం'లో నటించిన ఎం.రత్నకుమారికి బెస్ట్ డైలాగ్ ఆర్టిస్ట్ బహుమతులు వచ్చాయి. 'బ్రహ్మస్వరూపం' నాటికకు ఉత్తమ రంగాలంకరణ బహుమతిని పీబీ కుమార్ అందుకున్నారు. న్యాయనిర్ణేతలుగా ఆంజనేయులు నాయుడు (పొన్నూరు), చలసాని కృష్ణప్రసాద్ (విశాఖపట్నం), మానాపురం సత్యనారాయణ (పాలకొల్లు) వ్యవహరించారు. నిర్వాహక సంస్థల బాధ్యులు గోపరాజు రమణ, గోపరాజు విజయ్, సుద్దపల్లి మురళీధర్, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఈపీఓఎస్‌లో ఎరువుల విక్రయాల నమోదు తప్పనిసరి



ఈపీఓఎస్‌ను అందజేస్తున్న కృపాదాస్ తదితరులు

నగరంపాలెం: డీలర్లు విక్రయించిన ఎరువులను ఎప్పటికప్పుడు రైతుల ఆధార్ ద్వారా ఈపీఓఎస్ (అమ్మకం యంత్రాలు)లో నమోదు చేయాలని కమిషనర్ కార్యాలయ సంయుక్త వ్యవసా య సంచాలకులు వీడీవీ కృపాదాస్ ఆదేశించారు. పరదీప్ ఫాస్ఫేట్ లిమిటెడ్ , కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంయుక్తంగా కలెక్టర్ బంగ్లా రోడ్డులోని కృషి భవన్‌లో సోమవారం జిల్లాలోని రిటైల్ ఎరువుల డీలర్లకు అమ్మకం యంత్రాలు ఉచితంగా పంపిణీ చేశాయి. కృపాదాస్ మాట్లాడుతూ ఈపీఓఎస్‌లో నమోదు కాకపోతే కేంద్రం నిర్వహించే ఐఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో ఏపీలో అధిక ఎరువుల నిల్వలు ఉన్నట్లు చూపుతాయని తెలిపారు. తద్వారా రాష్ట్రానికి ఎరువులు సకాలంలో పంపిణీకావని చెప్పారు. జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పరదీప్ ఫాస్ఫేట్ లిమిటెడ్, కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీలు రూ.27 వేలు ఖరీదు చేసే 276 అమ్మకం యంత్రాలను రిటైల్ డీలర్లకు ఉచితంగా అందించాయని తెలిపారు. త్వరలో మరో 400 పంపిణీ చేయనున్నారని ఆయన వెల్లడించారు. 2015లో అందించిన యంత్రాల కంటే ఆధునాతనమైనవని, రైతుసేవలో వాటిని వినియోగించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏడీఏలు తోటకూర శ్రీనివాసరావు, జయదేవ్‌రాజన్ (ఎరువులు), ఏపీ రాష్ట్ర ఎరువుల డీలర్ల సంఘం అధ్యక్షుడు వి.నాగిరెడ్డి, పీపీఎల్ ప్రతినిధులు పీవీ సుభాష్, షేక్ మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు విధిగా హాజరుకావాలి

అధికారులకు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశం



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ

గుంటూరు వెస్ట్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి జిల్లా అధికారులు విధిగా హాజరుకావాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే అర్జీదారుల సమస్యలు వినాల్సిన బాధ్యత అధికారులకు ఉందని తెలిపారు. కొందరు అధికారులు ఈ కార్యక్రమాన్ని తేలిగ్గా తీసుకుంటున్నట్లు తన దృష్టికి వచ్చిందని, పీజీఆర్ఎస్‌కు రావడం కుదరని అధికారులు నిర్దిష్టమైన కారణాన్ని చూపాలని ఆమె చెప్పారు. ప్రజలు కూడా తమ అర్జీలను స్థానికంగా ఉండే మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయి అధికారులకు ప్రతి వారం ఇవ్వొచ్చని సూచించారు. దీంతో స్థానికంగా ఉండే ప్రజల సమస్యలు అక్కడే పరిష్కారమవుతాయని తెలిపారు. ప్రజలు అందించే అర్జీలకు తప్పనిసరిగా ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని అధికారుల్ని ఆమె ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లిప్తత ఉండకూడదని స్పష్టం చేశారు. అనంతరం వచ్చిన 197 అర్జీలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీ కుమారి, జిల్లా అధికారులు పరిశీలించారు.

నా పేరుతో అక్రమ అకౌంట్లు



నేను 2004 నుంచి 2016 వరకు ఓ ప్రైవేటు కంపెనీలో పని చేశా. కొంత కాలానికి యాజమాన్యం నాతో బ్యాంకు అకౌంట్ ఓపెన్ చేయించి చెక్కులపై సంతకాలు చేయించుకుంది. ఆ తర్వాత యాక్సిస్, కరూర్ వైశ్యా బ్యాంకుల్లో రూ.4 కోట్లు టర్నోవర్‌తో పాటు నా పేరుతో రూ.2 కోట్లు రుణాన్ని తీసుకుంది. నాకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సౌకర్యాలు అందడం లేదు. నన్ను మోసం చేసి నా పేరుతో రుణాలు పొందిన వారిపై చర్యలు తీసుకోవాలి.

–టి.ఎస్.ఎస్.ఏ.వి.ఎస్.ఆర్. స్వామి నాయుడు, గుంటూరు

తోళ్ల వ్యాపారంతో నరకప్రాయం



పాత గుంటూరులోని జామియానగర్ గొట్టాల రోడ్డులో కొందరు వ్యక్తులు పొట్టేళ్ల చర్మం ప్రాసెసింగ్ చేస్తున్నారు. కనీస జాగ్రత్తలు పాటించకపోవడంతో చుట్టుపక్కల నివసించే వారికి నరకప్రాయంగా ఉంది. ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారు. మాకు న్యాయం చేయండి.

–బి.ప్రసాద్, షేక్ రియాజ్, షేక్ వలి, గుంటూరు

ఈదురుగాలులు, వర్షంతో రైతులకు తీవ్ర నష్టం

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



ఈదురు గాలులకు పడిపోయిన అరటితోట



నష్టపోయిన అరటితోట రైతును పరామర్శిస్తున్న వేమారెడ్డి

తాడేపల్లి రూరల్: నిన్నమొన్నటి వరకు అకాల వర్షాల కారణంగా ధాన్యం, మొక్కజొన్న, జొన్న రైతులు నష్టపోతే ప్రస్తుతం ఈదురుగాలులు, వర్షం వల్ల అరటి రైతులు పూర్తిగా దెబ్బతిన్నారని వైఎస్సార్ సీపీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడు, అంజిరెడ్డి కాలనీ, 40 అడుగుల రోడ్డు ప్రాంతాల్లో ఈదురు గాలులకు పడిపోయిన అరటి తోటలను సోమవారం మంగళగిరి నియోజకవర్గ రైతు సంఘం నాయకులు రుక్మాంగరెడ్డితో కలసి ఆయన పరిశీలించారు. రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈదురు గాలుల వల్ల మంగళగిరి నియోజకవర్గంలో అరటి రైతులు పూర్తిగా నష్టపోయారని తెలిపారు. ఎకరానికి 200 నుంచి 300 చెట్ల వరకు పడిపోయాయని, గెలలు రాని చెట్లు సైతం కొన్నిచోట్ల కూలిపోయాయని చెప్పారు. ఇప్పటి వరకు నష్టాన్ని పరిశీలించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడలేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపరిహారం చెల్లించాలని దొంతిరెడ్డి వేమారెడ్డి డిమాండ్ చేశారు. రైతుల వద్ద నుంచి తాడేపల్లి తహసీల్దార్‌కు, హార్టికల్చర్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి జరిగిన నష్టాన్ని వివరించారు. పసుపు కల్లాల్లో ఎండబెట్టారని, అకాల వర్షం కారణంగా ఎర్రనల్లి ఏర్పడిందని, పసుపు రైతులను కూడా గుర్తించి నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తుమ్మ నారాయణ రెడ్డి, దొంతిరెడ్డి వీరారెడ్డి, మేకా ప్రసాద్ రెడ్డి, దొంతిరెడ్డి శివరామిరెడ్డి, భీమిరెడ్డి శరణ్ కుమార్ రెడ్డి, పులగం సందీప్‌రెడ్డి, శ్రీనివాస్‌రాజు, మల్లేశ్వరరావు, బాలకోటయ్య, తిరుమ, రాజ్‌మోహన్ పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **4,000** గరిష్ఠం : రూ. **6,200**

మోడల్ ధర రూ. **5,000**

మిర్చి యార్డు సమాచారం

(సోమవారం ధరలు)



వచ్చిన బస్తాలు	1,38,347
అమ్మకాలు	1,33,870
(గత నిల్వలతో కలిపి)	
నిల్వ	44,723

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	రూ. 9,500 - 13,200
నంబరు-5	రూ. 10,000 - 12,500
273	రూ. 10,000 - 12,400
341	రూ. 10,000 - 13,300
4884	రూ. 10,000 - 11,200
తాలుకాయలు	రూ. 4,500 - 6,500

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	రూ. 10,000 - 13,800
షార్క్-1	రూ. 10,000 - 12,000
బాడిగ - 355	రూ. 10,000 - 13,000
దేవనూరు డీలక్స్	రూ. 10,000 - 12,600
ఆర్మూర్	రూ. 9,800 - 11,200
తాలు	రూ. 4,500 - 6,500

-కొరిటెపాడు (గుంటూరు)

క్లుప్తంగా

పసుపు ధరలు

దుగ్గిరాల: స్థానిక పసుపు యార్డుకు సోమవారం1,239 బస్తాలు వచ్చాయి. మొత్తం అమ్మినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 889 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.10,300, గరిష్ఠ ధర రూ.11,450, మోడల్ ధర రూ.11,191 పలికింది. కాయలు 350 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.10,300, గరిష్ఠ ధర రూ.11,450, మోడల్ ధర రూ.11,150 లభించింది. మొత్తం 929.250 క్వింటాళ్ల అమ్మకాలు జరిగినట్లు ఆయన పేర్కొన్నారు.

మామని చంపిన అల్లుడికి జీవిత ఖైదు

గుంటూరు లీగల్: కుటుంబ కలహాల నేపథ్యంలో మామను చంపిన అల్లుడిపై కొత్తపేట పోలీసులు 2017లో ఐపీఎస్ 302 కేసును రిజిస్టర్ చేశారు. రెండవ అదనపు జిల్లా సెషన్ కోర్టులో కేసు విచారణకు సోమవారం వచ్చింది. వాద, ప్రతివాదనలు విన్న న్యాయమూర్తి వై. నాగరాజా, నిందితుడు కుర్ర శివ నాగభూషణానికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు. జరిమానా కట్టని పక్షంలో అదనంగా మూడు నెలలు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పును వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎండీ. అలీఖాన్ వాదనలు వినిపించారు.

మోసపోయాం.. ఆదుకోండి !

న్యాయం చేయాలని పోలీసులకు దివ్యాంగుల విన్నపం

నగరంపాలెం: పోగొట్టుకున్న కారుని అప్పగించడం లేదని ఓ అంధుడు, ఉద్యోగం పేరుతో తనను ఇద్దరు వ్యక్తులు మోసగించారని మరో దివ్యాంగురాలు వాపోయారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం ప్రజా ఫిర్యాదులు - పరిష్కారాల కార్యక్రమం (పీజీఆర్ఎస్) నిర్వహించారు. బాధితుల నుంచి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఫిర్యాదులు స్వీకరించారు. బాధితుల గోడు అలకించారు. ప్రజా ఫిర్యాదులను చట్ట పరిధిలో పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. నిర్ణీతవేళల్లో ఫిర్యాదులు పరిష్కరించాలని పోలీస్ అధికారులకు సూచించారు. జిల్లా ఏఎస్పీ (పరిపాలన) రమణమూర్తి, డీఎస్పీలు శివాజీరాజు (సీసీఎస్), శ్రీనివాసరెడ్డి (మహిళా పీఎస్) ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లావ్యాప్తంగా పీజీఆర్ఎస్‌కు వచ్చిన బాధితులకు సిబ్బంది మజ్జిగ పంపిణీ చేశారు.



సమస్య అలకిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

కారు ఇప్పించాలి

నాలుగేళ్ల కిందట కారు కొనుగోలు చేశా. నా కొడుకు బాడుగలకు వెళ్లేవాడు. గతేడాది డిసెంబర్‌లో మృతి చెందారు. అయితే, అప్పటి నుంచి కారు కనిపించలేదు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశా. తుళ్లూరు మండలం రాయపూడిలో కారుని గుర్తించారు. గత ఎన్నికల్లో రాయపూడిలో ఓ టీడీపీ నేత అధీనంలో ఉందని తెలిసింది. గత నెల 18న స్థానిక పోలీస్‌స్టేషన్‌కు కారు తీసుకు వచ్చారు. అవతలి వ్యక్తికి రూ.1.50 లక్షలు చెల్లించాలని చెబుతున్నారు. అయితే, తాను ఎవరికీ డబ్బులు చెల్లించాల్సిన అవసరంలేదు. అదిగాక ఓ వ్యక్తి వద్ద రూ.15 లక్షలు తీసుకున్నట్లు గత నెలలో కోర్టు ద్వారా నోటీసులు పంపించారు. కారు ఇప్పించకపోగా తమపై తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారు. కొడుకు మరణాన్ని జీర్ణించుకోలేక ఉన్న తమపై కేసులు బనాయిస్తున్నారు. ఇప్పటికే జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జరిగిన పీజీఆర్ఎస్‌లో మూడుసార్లు ఫిర్యాదు చేశా. అయినా, ఎవరూ పట్టించుకోవడంలేదు. అంధుడిని కావడంతో పోలీస్‌స్టేషన్ల చుట్టు తిరగలేకపోతున్నా. అవతలి వ్యక్తులు బెదిరిస్తున్నారు. నాకు న్యాయం చేయాలి.

– నాగిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, జూనియర్ సహాయకుడు, గుంటూరు మెడికల్ కళాశాల



అంధుడైన వెంకటేశ్వరరెడ్డి బాధను ఆలకిస్తున్న జిల్లా ఏఎస్పీ రమణమూర్తి

ఉద్యోగాలు, రుణాల పేర్లతో మోసం



ఇటీవల శారదా కాలనీకి చెందిన ఇద్దరు వ్యక్తులు పరిచమయ్యారు. కలెక్టర్ కార్యాలయంలో కంప్యూటర్ అపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికారు. విడతలు వారీగా రూ.1.90 లక్షలు చెల్లించాను. ఉద్యోగం వచ్చాక, మిగతా రూ.3 లక్షలు ఇవ్వాలని ఒప్పందం చేశారు. అయితే, నెలలు గడిచిన ఉద్యోగం ఊసెత్తలేదు. ఈలోగా ఇంటి రుణం ఇప్పిస్తానంటే వారిద్దరికీ రూ.3.30 లక్షలు చెల్లించా. బ్యాంక్ నుంచి రుణం మంజూరైనట్లు చెక్కు కూడా చూపించారుఉ. నాతో పాటు పలువురికి రుణాలు ఇప్పిస్తామని చెబితే వారు డబ్బు చెల్లించారు. ఇద్దరికీ సుమారు రూ. 12.30 లక్షలు చెల్లించాం. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేస్తే స్వీకరించలేదు. మిగతా వారు నన్ను డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. సదరు వ్యక్తులను విచారించి న్యాయం చేయాలి.

– జి.భూలక్ష్మి (దివ్యాంగురాలు), ఓర్సు పెద్దింటమ్మ, ఒకటో వీధి, ఐపీడీ కాలనీ

డబ్బులు చెల్లించకుండా ఇంటి నుంచి పరారీ

స్థానికంగా ఉండే ఓ వ్యక్తి మిర్చి యార్డులో ఓ ట్రేడర్స్ పేరుతో వ్యాపారం చేసేవాడు. స్థానికులతో సన్నిహితంగా మెలిగేవాడు. మిర్చి వ్యాపారం చేద్దామని నమ్మబలికాడు. అందులో వచ్చే లాభాల్లో అదనపు వడ్డీ చెల్లిస్తానని బదులిచ్చాడు. దీంతో అందరం కలిసి సుమారు రూ.1.30 కోట్లు దఫాల వారీగా చెల్లించాం. నెలలు గడిచినా డబ్బులు చెల్లించలేదు. రెండేళ్లు గడిచాయి. అతడ్ని పలుమార్లు అడిగినా సరైన సమాధానం లేదు. ఆరు నెలలు కిందట ఇంటి నుంచి పరారయ్యాడు. ఇప్పటి వరకు అతని ఆచూకీ తెలియలేదు. అధిక వడ్డీలకు అప్పులు తీసుకువచ్చి, అతనికి చెల్లించాం. న్యాయం చేయాలని కోరుతున్నా.

-డి.కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, పద్మజ, జె.నిర్మల, జి.ధనలక్ష్మి, రెడ్లబజార్, సంగడిగుంట

ధాన్యం డబ్బులు అడిగితే బెదిరింపులు

మా గ్రామంలో రైస్‌మిల్లు నడిపే వారికి 2018లో 900 బస్తాల ధాన్యం అప్పగించాను. డబ్బులు వెంటనే చెల్లిస్తామని చెప్పారు. సంవత్సరాలు గడిచినా సుమారు రూ.60 లక్షలు చెల్లించలేదు. ఈ క్రమంలో రూ.45 లక్షలు చెల్లిస్తానని హామీ ఇచ్చారు. డబ్బులు అడిగితే రౌడీ మూకలతో బెదిరిస్తున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదు. నాకు న్యాయం చేయాలి.

– జి.శ్యాంకుమార్, మునిపల్లె, పొన్నూరు మండలం.

కనుల పండువగా అమ్మనాన్నల కల్యాణం

బాపట్ల టౌన్: మండలంలోని జిల్లెళ్లమూడి గ్రామంలో వేంచేసియున్న జగన్మాత మాతృశ్రీ అనసూయ మహాదేవి, బ్రహ్మాండం నాగేశ్వరరావుల కల్యాణ మహోత్సవం సోమవారం కనుల పండువగా జరిగింది. విశ్వజననీ పరిషత్ కోశాధికారి సుబ్రమణ్యం మాట్లాడుతూ అనసూయదేవి అందరి అమ్మగా, జిల్లెళ్లమూడి అమ్మగా లోక ప్రసిద్ధి చెందారన్నారు. జిల్లెళ్లమూడి గ్రామానికి ఏ వేళప్పుడు ఎవరొచ్చినా వారికి తృప్తిగా భోజనం పెట్టి కడుపునింపడం, ఆకలితో జిల్లెళ్లమూడి రావచ్చు కానీ, జిల్లెళ్లమూడి నుంచి ఆకలితో వెళ్లరాదనేది అమ్మ ఆశయమన్నారు. జిల్లెళ్లమూడి అమ్మ తొలినాళ్లల్లో వారి పతిదేవుల సంపాదనతోనే తమ దర్శనార్థం వస్తున్న వారందరికీ స్వయంగా అన్నం వండి, వడ్డించడం చేసేవారన్నారు. అనతి కాలంలో అమ్మ బిడ్డలందరి సమష్టి కృషితో జిల్లెళ్లమూడిలో అన్నపూర్ణాలయం ఏర్పడిందన్నారు. సంవత్సరమంతా నిత్యకల్యాణం, పచ్చతోరణం మాదిరి ఉంటుందన్నారు. అమ్మవారి కల్యాణమహోత్సవంలో భాగంగా సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మనాన్నలకు విశేష పూజా కార్యక్రమాలు జరిగాయన్నారు. కల్యాణం అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అమ్మనాన్నల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

మహిళా కండక్టర్‌పై దాడి కేసులో జైలుశిక్ష, జరిమానా

మేడికొండూరు: మహిళా కండక్టర్‌పై దాడి చేసిన వ్యక్తికి శిక్షతో పాటు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నిందితుడైన దండు రామనాథరెడ్డి విధి నిర్వహణలో ఉన్న కండక్టర్ విధులకు అడ్డుపడ్డాడు. శారీరక దాడికి పాల్పడటమే కాకుండా, ఆమె ఆత్మాభిమానాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడ్డాడు. వివరాలు.. మేడికొండూరు మండలంలో 2021 అక్టోబరు 2న మహిళా బస్సు కండక్టర్ షేక్ మొహిద్‌నిషా బేగంపై రామనాథరెడ్డి దాడి చేసి ఆమెను కొట్టి గాయపరిచాడు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ ప్రవేశపెట్టిన సాక్షులు, జరిగిన సంఘటనను కోర్టులో వివరించారు. వాదోపవాదనలు విన్న గుంటూరు 5వ జేఎఫ్‌సీఎం కోర్ట్ జడ్జి కోలార్ లత నేరం రుజువు కావడంతో రెండు సంవత్సరాలు జైలుశిక్ష, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరుపు అల్లంశెట్టి పవన్ కుమార్ వాదనలు వినిపించారు.

పోరుబాటలో ఉపాధ్యాయులు

- ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరసన
- విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని, తక్షణమే పరిష్కారం దిశగా చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని ఏపీటీఎఫ్ నాయకులు హెచ్చరించారు. సంఘ రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు బ్రాడీపేటలోని పశ్చిమ తహసీల్దార్ కేంద్రం వద్ద సోమవారం గుంటూరు జోన్ కన్వీనర్ పి.నాగశివన్నారాయణ అధ్యక్షతన ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా శాఖ అధ్యక్షుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ 117 జీవో అమలుకు పూర్వ స్థితిలో ఉన్న పాఠశాల విద్యారంగాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలల నుంచి 3,4,5 తరగతులు వెనక్కి తీసుకువస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయకపోగా, అదనంగా 1,2 తరగతులను సైతం కలపడం తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను మోసగించడమేనని ఆరోపించారు. యువగళం పాదయాత్రలో విద్యాశాఖ మంత్రి లోకేష్ ఇచ్చిన హామీ మేరకు ఒకటి నుంచి ఐదు తరగతుల్ని ప్రాథమిక పాఠశాలలోను, 6 నుంచి 10 లేక 12 తరగతులు ఉన్నత పాఠశాలల్లో ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలలో 44 మంది విద్యార్థులు మించితే రెండవ సెక్షన్ ఇవ్వాలని కోరారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి ఉన్నత పాఠశాలకు గ్రేడ్-2 హెచ్ఎం, పీఈటీ పోస్టును ఇచ్చి, పూర్వ ప్రాథమిక పాఠశాలలను ప్రాథమిక పాఠశాలలకు అనుసంధానం చేయాలన్నారు. అసంబద్ధ నిర్ణయాలను కొనసాగిస్తే ఈనెల 9వ తేదీ అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహిస్తామని, అప్పటికీ పరిష్కారం కాకపోతే ఈనెల 14వ తేదీన విజయవాడలో పెద్ద ఎత్తున మహా ధర్నా చేపడతామని హెచ్చరించారు. గుంటూరుతో పాటు, పొన్నూరు, తెనాలి, మంగళగిరిలో నిరసన ప్రదర్శనలు విజయవంతంగా జరిగాయని తెలిపారు. ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్ మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిషన్ నియమించి, కరువు భత్యం 30 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డీఏలు ప్రకటించి, మొత్తం బకాయిలను విడుదల చేయాలని కోరారు. అనంతరం డెప్యూటీ తహసీల్దార్‌కు మెమోరాండం సమర్పించారు. నిరసన ప్రదర్శనలో ఎం.ఎన్. మూర్తి, ఎస్.ఎస్.ఎన్. మూర్తి, లక్ష్మీనారాయణ, కె.రమేష్, దాస్, రమాదేవి, వెంకటేశ్వర్లు, జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి హనుమంతరావు, కిశోర్ షా భారతి, విజయశ్రీ, భాస్కర్, కుటుంబరావు, బాలరాజు, సుబ్బారావు, జహంగీర్ పాల్గొన్నారు.



పశ్చిమ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ఎల్‌టీపీల పొట్టగొడుతున్న ప్రభుత్వం

లైసెన్స్‌డ్ ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సతీష్

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం గత కొద్ది నెలల కిందట నూతనంగా సెల్ఫ్ సర్టిఫికెట్ స్కీం -2025 నిబంధనలు తీసుకువచ్చి ఎల్‌టీపీ(లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్)ల పొట్టగొడుతోందని లైసెన్స్‌డ్ ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. సతీష్ వాపోయారు. సోమవారం అరండల్‌పేటలోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 300 చదరపు మీటర్లలోపు స్థలాలకు భవన నిర్మాణ అనుమతుల్లో తప్పులు జరిగితే అందుకు బాధ్యులుగా ప్లాన్ ఇచ్చిన ఎల్‌టీపీలను ఇబ్బందులకు గురిచేసే విధంగా ఎస్‌సీఎస్ (సెల్ఫ్ సర్టిఫికెట్ స్కీం) ఉందని తెలిపారు. భవన నిర్మాణ సమయంలో డీవియేషన్ చేసుకుని యజమాని ఇంటి నిర్మాణం చేపడితే దానికి ఎల్‌టీపీలను బాధ్యులుగా చేయడం సబబు కాదని పేర్కొన్నారు. బీఎస్ఎస్ చట్టం కింద చర్యలతో పాటు ఐదేళ్ల పాటు లైసెన్స్ రద్దు చేస్తామని చెప్పడం సమంజసం కాదని తెలిపారు. ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ నిబంధనలతో ఎల్‌టీపీలు గత కొద్ది నెలలుగా ప్లాన్‌లు దరఖాస్తు చేసే పరిస్థితి లేదని, కొద్ది నెలలుగా ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎస్‌సీఎస్ స్కీం కింద తెచ్చిన నిబంధనలను సడలించాలని ఆయన కోరారు. సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మైనేనిలక్ష్మణ్, నగర చైర్మన్ పరమహంస, నగర అధ్యక్షుడు బాలాజీ, ప్రధాన కార్యదర్శి కృష్ణకాంత్, నాగశ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సతీష్

ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి ఎక్సలెంట్ ప్లేస్‌మెంట్ అవార్డు

నీరుకొండ(మంగళగిరి): నీరుకొండలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి ఎక్సెలెంట్ ప్లేస్‌మెంట్ అవార్డు లభించింది. ఈ మేరకు యూనివర్సిటీ నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసియా టుడే మీడియా సంస్థ 15వ అంతర్జాతీయ విద్యా సదస్సును ఆదివారం న్యూఢిల్లీలో నిర్వహించింది. ఇందులో 2023-24లో దేశవ్యాప్తంగా ప్లేస్‌మెంట్‌లో అగ్రస్థానం సాధించిన ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి ఎక్సలెంట్ ప్లేస్‌మెంట్ అవార్డు వచ్చింది. సదస్సులో కేంద్ర జలశక్తి మంత్రి రాజ్ భూషన్ చౌదరి అవార్డును యూనివర్సిటీ ప్రతినిధి వివేకానందకు అందజేసి అభినందనలు తెలిపారు.



మంత్రి రాజ్ భూషన్ చౌదరి నుంచి అవార్డు అందుకుంటున్న డాక్టర్ వివేకానందన్

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: మెగా జాబ్ మేళాను యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో మెగా జాబ్ మేళా పోస్టర్‌ను జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, అధికారులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో ఈ నెల 9న ఏటుకూరు రోడ్డులోని పుల్లడిగుంటలో గల మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు చెప్పారు. 10వ తరగతి నుంచి బీటెక్, ఎంబీఏ చదుకున్న యువతీ యువకులు హాజరు కావచ్చని ఆమె సూచించారు. మొత్తం 45 కంపెనీలు ఇక్కడకు వస్తున్నాయని, 1,400 ఉద్యోగావకాశాలు ఉన్నాయని తెలిపారు. అభ్యర్థులు వచ్చేటప్పుడు బయోడేటాతోపాటు విద్యార్హతలకు సంబంధించి ఫొటోస్టాట్ కాపీలు, ఆధార్ వెంట తీసుకురావాలని ఆమె సూచించారు. జీతం రూ. 9,000- 35,000 మధ్యలో ఉంటుందని పేర్కొన్నారు. 18-25 సంవత్సరాల వయస్సు ఉన్నవారు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు బి.రవి (63042 92828), సాయి కుమార్ (80745 97926) సంప్రదించాలని ఆమె సూచించారు. న్నారు. సమావేశంలో డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

12 నుంచి 20 వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను ఈనెల 12 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పరీక్షల నిర్వహణను అధికారులు సమన్వయంతో నిర్వహించాలని ఆమె సూచించారు. మాస్‌కాపీయింగ్, పొరపాట్లకు తావు ఇవ్వకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉందని తెలిపారు.ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం జనరల్, ఒకేషనల్ కోర్సులకు 23279 మంది, ద్వితీయ సంవత్సరానికి 3,883 మంది హాజరవుతున్నారని ఆమె పేర్కొన్నారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయాలని, కేంద్రాల్లో గందరగోళం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష పత్రాలు జాగ్రత్త పరచడంలో గానీ, పంపిణీల్లో గానీ పొరపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచాలని తెలిపారు. కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్లతో పాటు ఏఎన్ఎంలు అందుబాటులో ఉండేటట్లుగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష జరుగుతున్న సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, రీజనల్ ఇంటర్మీడియట్ అధికారి జుబేర్, డీఈఓ రేణుక, డీఆర్వో షేక్ ఖాజావలి, ఆర్డీవో కె.శ్రీనివాసరావు, డెప్యూటీ కలెక్టర్ గంగరాజు, అధికారులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో కుట్టు మిషన్ల స్కాం

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ

నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 నెలల్లో ఎన్నో స్కాంలు జరిగాయని, తాజాగా బీసీ మహిళలకు కుట్టు మిషన్లు శిక్షణ పేరుతో రూ.150 కోట్ల స్కాం చేస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ ఆరోపించారు. బృందావన్ గార్డెన్స్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. శిక్షణ తరగతులు కూడా ప్రభుత్వ భవనాల్లో పార్టీ కార్యకర్తల ద్వారా నిర్వహిస్తోందని తెలిపారు. శిక్షణ ఇవ్వకుండానే ఇచ్చినట్లుగా చూపుతున్నారని మండిపడ్డారు. బీసీ మహిళలంటే ప్రభుత్వానికి ఎంత చిన్న చూపో ఈ విషయం ద్వారా స్పష్టంగా అర్థమవుతోందని పేర్కొన్నారు. పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు తాడిబోయిన వేణుగోపాలరావు మాట్లాడుతూ కుట్టు శిక్షణ సమయం కూడా 360 గంటల నుంచి 130 గంటలకు కుదించారని తెలిపారు. రాష్ట్ర కుమ్మర శాలివాహన విభాగ అధ్యక్షుడు మండేపూడి పురుషోత్తం మాట్లాడుతూ కూటమి పాలనలో ముడుపులు ఇచ్చిన కంపెనీలకు కుట్టు మిషన్ల కాంట్రాక్ట్ అప్పగించి తద్వారా జేబులు నింపుకునేందుకు పాలకులు సిద్ధమయ్యారని ఆరోపించారు. సమావేశంలో బీసీ సంఘ ముఖ్య నాయకులు తాడిబోయిన సుబ్బారావు, మయకుంట్ల రాయప్ప, దానబోయిన నాగేశ్వరరావు, కుక్కల రాంప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజనారాయణ

కాలువలకు మరమ్మతులు చేయించాలి

బాపట్ల: కృష్ణా పశ్చిమ కాలువ, దుగ్గిరాల డివిజన్, రేపల్లె డివిజన్‌లోని నీటి పారుదల కాలువలకు మరమ్మతులు చేయించాలని పలువురు రైతులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళీని కలిసి సోమవారం వినతిపత్రం అందించారు. అమృతలూరు, చెరుకుపల్లి, నగరం, భట్టిప్రోలు, వేమూరు మండలాల పరిధిలోని రైతులు కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. కృష్ణ పశ్చిమ కాలువ, దుగ్గిరాల డివిజన్, రేపల్లె డివిజన్‌లోని నీటి పారుదల ఆధారిత భూములలో వరి పంట సాగు చేస్తున్నామని వివరించారు. రేపల్లె మెయిన్ డ్రెయిన్ (గంగోలు కాలువ) నుంచి 30 ఏళ్లగా మురుగునీటి సమస్యను ఎదుర్కొంటున్నామని వివరించారు. ఈ ఏడాది(2024-25) ఖరీఫ్ సీజన్‌లో కురిసిన భారీ వర్షాల కారణంగా రేపల్లె మెయిన్ డ్రెయిన్ పొంగి చెరుకుపల్లి మండలంలోని కనగాల, గూడవల్లి, నడింపల్లి, పొన్నపల్లి గ్రామాలలో, అమృతలూరు, భట్టిప్రోలు, వేమూరు, నగరం మండలంలోని కొన్ని గ్రామాలలో వరి పంట పూర్తిగా దెబ్బతిందని వివరించారు. 2025-26 ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే కాలువను పూర్తిస్థాయిలో పూడిక తీసి, సామర్థ్యం పెంచి ముంపు నివారించాలని రైతులు కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మేక మహేష్, గోగినేని బాలకోటేశ్వరరావు, గడ్డిపాటి రాఘవేంద్రరావు, కోట నాగ కోటి వెంకటరమణ తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న రైతులు

జీజీహెచ్‌లో హిపో క్రేడ్స్ విగ్రహం

గుంటూరు మెడికల్: ఫాదర్ ఆఫ్ మెడిసిన్‌గా పిలువబడే హిపోక్రేడ్స్ విగ్రహాన్ని గుంటూరు జీజీహెచ్‌లో ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మొట్టమొదటిసారిగా గుంటూరు జీజీహెచ్‌లో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈమేరకు సోమవారం విగ్రహాన్ని తెనాలి నుంచి గుంటూరు జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ ప్రత్యేక శ్రద్ధతో విగ్రహాన్ని తయారు చేయించారు. ఓపీ విభాగంలో నాట్కో క్యాన్సర్ సెంటర్‌కు వెళ్లే రహదారిలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. త్వరలోనే విగ్రహావిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేస్తామని తెలిపారు.



మైనార్టీలకు బ్యాంకబుల్ సబ్సిడీ పథకం ప్రారంభం

ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలి

లక్ష్మీపురం: మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా జిల్లాలోని మైనార్టీలకు (ముస్లింలు, బౌద్ధులు, జైనులు, సిక్కులు, పార్సీలు) ఎకనామిక్ సపోర్ట్ స్కీం (బ్యాంకబుల్ సబ్సిడీ పథకం) నాలుగు స్లాబ్‌లుగా మంజూరు చేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రోషన్ జమీర్ బాషా సోమవారం తెలిపారు. లబ్ధిదారులు ఈనెల 25లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ నగరంపాలెం లేదా 9849901142,9652960367 నంబర్లలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

పిడుగుపాటుకు గురైన గొర్రెల కాపరి మృతి

కొల్లూరు: పిడుగుపాటుకు గురైన తెలంగాణ రాష్ట్రానికి చెందిన గొర్రెల కాపరి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆదివారం కురిసిన పిడుగులతో కూడిన వర్షం కారణంగా కొల్లూరు సమీపంలోని క్రాప అడ్డరోడ్డు వద్ద పంట పొలాల్లో గొర్రెలు మేపుతున్న కాపరి పిడుగుపాటుకు గురై విషమ పరిస్థితుల్లో గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విషయం విదితమే. పోలీసుల కథనం మేరకు.. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా కోయలకొండ మండలం చంద్రాస్‌పల్లికి చెందిన వడ్డే అంజనేయులు (22) వర్షం కురుస్తున్న సమయంలో ఫోన్ మాట్లాడుతుండగా అతనికి సమీపంలో పిడుగు పడింది. దీని ధాటికి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్న అతడ్ని పంట పొలాల్లోని కూలీలు గమనించి కొల్లూరు పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడ నుంచి తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు, అక్కడ నుంచి గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. వైద్య సేవలు అందిస్తున్న సమయంలో పరిస్థితి విషమించడంతో ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. వైద్యశాల నుంచి అందిన నివేదిక ఆధారంగా కొల్లూరు ఏఎస్ఐ కట్టా వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు మృతదేహాన్ని అప్పగించినట్లు ఏఎస్ఐ తెలిపారు.